



ఆ రోజు సాయంకాలం కాలేజి ఆడిటోరియమ్‌లో పెద్ద టీ పార్టీ జరుగుతూ ఉంది. దానికి విద్యార్థులు, విద్యార్థినులు, లెక్చరర్లు ప్రిన్సిపాలు అందరూ హాజరయ్యారు. సంభాషణలు స్వేచ్ఛగా సాగిపోతున్నాయి. కొందరు గుంపులు గుంపులుగా అక్కడక్కడ నిలబడి, ప్లేట్లు చేతుల్లో పట్టుకొని, ఫలహారాలు సేవిస్తూ మాట్లాడుకుంటున్నారు.

ఒక అరగంట తరువాత గిరిజ కుర్చీమీదనుంచి నెమ్మదిగా లేచి, దూరంగా ఉన్న ఒక కిటికీ వద్దకు వెళ్ళి, తదేక ధ్యానంతో బయటకు చూస్తూ ఉండటం మోహన్ కనిపెట్టేడు. నెమ్మదిగా తను కూడా లేచి ఆమె దగ్గరకు వెళ్ళేడు.

"నిన్న ... నేనన్నది ఏమైనా జరిగిందా ?" అని మెల్లగా ఆమెను ప్రశ్నించాడు. విచారంగా ఉన్న గిరిజ మొహాన్ని చూచి అతను ముందుగానే ఈ ప్రశ్నకు సమాధానాన్ని గ్రహించేశాడు. కాని మాట వరుసకు అలా అడుగక తప్పలేదు.

"లేదు" అన్నట్లు తల ఊపి ఆ

అమ్మాయి కన్నీళ్ళు కార్చడం మొదలుపెట్టింది.

మోహన్‌కు ఇక ఏం మాట్లాడాలో తెలియక కిటికీలోంచి చేతిని బయటకు పెట్టి, అక్కడే పెరుగుతున్న ఒక చెట్టు ఆకుల్ని త్రుంచి, నలిపి క్రింద పారేస్తున్నాడు... ...

గిరిజ, మోహన్ బి. యస్ సి చదువుతున్నారు. ఒకసారి బస్సులో అందరూ పిక్‌నిక్‌కు వెళ్తున్నప్పుడు అతని చెప్పులు, ఆమె చెప్పులు సీటు క్రిందకు జారి కలిసిపోయాయి. దిగవలసిన చోటు వచ్చినప్పుడు గిరిజ అంది.

"ఎక్స్‌క్యూజ్ మి. నా చెప్పులు తీసుకోనివ్వండి"

"నేను తీసిస్తానుండండి" అంటూ అతనామె స్లిప్పర్లను బయటకు లాగి ఆమె కందిచ్చాడు.

"అయ్యో! మీరెందుకు? నేనే తీసుకునేదాన్ని కదండి" అని గిరిజ నొచ్చుకుంది.

"మరేం ఫర్వాలేదులెండి" అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ.

ఈ సంభాషణతో ఇద్దరికీ పరిచయమయ్యింది. ఆ తరువాత కాలేజి ఆవరణలో ఎప్పుడన్నా కలుసుకున్నపుడు ఇద్దరూ మాట్లాడుకొనేవారు.

"మీదే వూరండి?", ఒకసారి అతనామెను అడిగాడు.

"అనకాపల్లి"

"మీ తండ్రిగారేం చేస్తారు?"

"ఆయన ఇప్పుడు లేరండి. చనిపోయి అయిదు సంవత్సరాలయింది. మా అమ్మ మావూళ్ళోనే ఉంటోంది. చదువుకు నేనిక్కడకొచ్చి హాస్టల్లో ఉంటున్నాను."

"అలాగా"

"మరి మీరు?"

"మాది విజయనగరంలెండి. మా నాన్నగారక్కడ ఒక పత్రికను నడుపుతున్నారు. మొదట్లో చిన్నదే కాని రానురాను అభివృద్ధిలోనికి వచ్చింది..."

"దాని పేరు?"

మోహన్ చెప్పేడు.


"ఓహో, అదా! ప్రతినెల దాన్ని చదువుతూనే ఉంటాను. కథలు స్టాండర్డు బాగుంటుంవి."

"థాంక్స్."

"మరి బి. యస్ సి మీ వూళ్ళో చదువుకోక ఈ విశాఖపట్టణంలో చదువుతున్నారేమిటి?"

"నాకు ఓడల్లో తిరుగుతూ విదేశాలు చూడాలని ఆసక్తి ఉంది. అందుచేత ఈ చదువు పూర్తయాక తరువాత ఏ ఓడలోనో ఉద్యోగం సంపాదించ దలచుకున్నాను. కాబట్టి ఈ వూళ్ళో ఉంటే ఏ స్టీమరు కంపెనీ వాళ్ళతోనో స్నేహంచేసి, వాళ్ళసహాయంతో నాకు కావలసిన పని సంపాదించుకోవచ్చని నా ఆశ. కాని మా నాన్న మాత్రం మా పత్రికను ఇంకా ఇంప్రూవ్ చేసుకోవచ్చు విజయనగరం వచ్చెయ్యమంటాడు.. మరి, చదువు పూర్తయిన తరువాత మీరేం చెయ్యదలచుకున్నారు?"

"ఏమీలేదు. ఏదో ఒక ఉద్యోగం చూసుకోవడమే."




"లేకపోతే పెళ్ళి."

ఆమె నవ్వింది.

"అదిప్పు డప్పుడే కాదులెండి."

"అదేమిటి? నచ్చినవాడు దొరికితే మీరే ముందతని మెళ్లో మంగళసూత్రం కట్టేస్తారు."

గిరిజ మళ్ళీ నవ్వి అంది.

"స్త్రీలు పురుషులకు మంగళసూత్రం కడతారటండీ, చోద్యం? పెళ్ళయిన తరువాత ముక్కుకితాడేస్తారుగాని."

"అమ్మ బాబోయ్, ఇక నేను చస్తే పెళ్ళి చేసుకోను."

వారి పరిచయం రోజురోజుకు వృద్ధిచెందసాగింది. సినిమాలకు, నాటకాలకు, పార్కులకు, బీదికి వెళ్తుండేవారు. ఆఖరికి వారిస్నేహం ప్రేమగా మారిపోయింది. ప్రేమ మాటలు జరిగిన తరువాత పెళ్ళి మాట వచ్చింది.

"నేను ఫారిన్ వెళ్ళివచ్చిన తరువాత పెళ్ళి చేసుకుందాం."

"అంటే రెండు మూడేళ్ళన్నా అవుతుందా?"

"అవ్వచ్చు"

"ఈలోగా విదేశాలలో ఏ దొరసాన్నన్నా పట్టుకుంటావేమో?"

"నా మాటకేంగాని, ఈ లోగా నువ్వెవరినీ కట్టుకోకు"

"చాల్లే నీ మాటలు."

కొన్నాళ్ళ తరువాత వారి ప్రేమ పక్వదశకు వచ్చింది. సినిమాల్లోని ప్రేమ సన్నివేశాలు, కోయిల కుహూ కుహూలు, పార్కులలోని రంగురంగుల పుష్పాలు మన ప్రేమికుల్ని వేధించసాగాయి.

ఒక ఆదివారంనాడు మోహన్ గిరిజను అడిగాడు.

"నా రూముకు నువ్వెప్పుడూ రాలేదు కదూ?"

'నువ్వెవరింట్లోనో అద్దెకుంటున్నానని చెప్పేవు?'

"అవును, మా ఇంటి ఆవిడ... కాదు కాదు మా ఇల్లుగల ఆవిడ పేరు రమణమ్మ. ఏభై ఏళ్ళది. ఒక భాగంలో తనుంటూ రెండవ భాగాన్నంతా నా కద్దెకిచ్చేసింది. కాబట్టి నాది రూము కాదు; ఇల్లే అనాలి. వెళ్దాం వస్తావా? రమణమ్మగారిని కూడా చూడచ్చు."

సంశయిస్తూ గిరిజ అంది:

"ఇప్పుడు కాదులే. మరొకసారి వస్తాను"

"ఇప్పుడు కాకపోతే మరెప్పుడు? మరో మూడు వారాలలో యూనివర్సిటీ పరీక్షలు మొదలవుతున్నాయి. ఇక చదువుల్లో పడిపోతాం. ఇలా షికారుకు తిరగడం కుదరదు. వస్తే ఇప్పుడే రావాలి.'

చివరకు గిరిజ ఒప్పుకోక తప్పింది కాదు.

"సరే, వెళ్దాంపద", అంది.

ఇంటికి వెళ్ళేసరికి రమణమ్మగారి భాగానికి తాళం వేయబడి ఉంది.

"బహుశః ఏ బంధువులింటికైనా వెళ్ళి ఉంటుంది... పద లోపలికి వెళ్దాం"

ఏకాంతత వారి నిగ్రహశక్తుల్ని తుదముట్టించింది. జరిగిన దానికి ఏ ఒకరిదీ తప్పుకాదు; ఇద్దరూ బాధ్యులే అనాలి. తనకోరికను వెళ్ళబుచ్చటం అతని తప్పు; దాన్ని గట్టిగా నిరాకరించలేకపోవటం ఆమె తప్పు. చివరకు ఇద్దరూ చాల పశ్చాత్తాప పడ్డారు.

మరుసటి దినంనుంచి వాళ్ళిద్దరూ కలవనేలేదు. రాత్రింబగళ్ళు బాగా చదివేరు. పరీక్షలు వారం రోజులు జరిగాయి. అన్నీ బాగా రాశారు. అందులో ఉత్తీర్ణులు కావడం ఖాయం.

ఇక స్టూడెంట్సు ఎవరి ఊళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయేముందు కాలేజీలో పెద్ద టీ పార్టీ ఏర్పాటు చేయబడింది. ఆ పార్టీకి ముందు రోజునే గిరిజ మోహన్ను కలసి తన అనుమానాన్ని బయటపెట్టింది.

"నీది వట్టి భ్రమ. రేపు చూడు. అంతా సవ్యంగా జరిగిపోతుంది" అని ధైర్యం చెప్పేడు...

చేతికి అంటుకున్న ఆకు పసరును జేబురుమాలతో తుడుచుకొని, మోహన్ గిరిజవైపు తిరిగాడు.

"ఇష్, జాగ్రత్త. కన్నీళ్ళు తుడుచుకో. ఎవరన్నా చూస్తారు."

ఒక నిమిషం ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

మోహన్ మళ్ళీ ప్రశ్నించాడు.

"ఆలస్యం అవటానికి అవకాశం లేదా?"

"అటువంటిదెప్పుడూ నాకు జరగలేదు."

"పోనీ, మరి రెండు రోజులు చూడరాదు?"

"ఏమీ లాభం లేదు, మోహన్. ఇప్పటికే చాల ఆలస్యమయిపోయింది."

"రెండు రోజులే కదా"

'సరే'

రెండు రోజులు జరిగిపోయాయి. ఆ పైన మరి నాలుగు రోజులు కూడా గడచిపోవడంతో వారి అనుమానాలు దృఢపడినాయి. దానితో గిరిజ వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టింది. మోహన్ మనసు కరిగిపోయింది. పైకి ఆమెకు ధైర్యం చెప్తున్నా లోలోన బాధపడుతూనే ఉన్నాడు.

'చూడు గిరిజా, ఈ క్షణంనుంచి ఈ బాధ్యతంతా నా మీద వేసుకుంటున్నాను. నువ్వేమీ విచారపడకు'

'జరిగినదానికి ఏడ్వకుండా ఎలా ఉండగలను మోహన్?'

'నా మాట విను, గిరిజా. నాకొక ఉపాయం తట్టింది'

'ఏమిటది?'

'ఎబార్షన్.'

'అమ్మో, అదా!'

'చదువుకున్నదానివి నువ్వే ఇలా భయపడితే, ఎలా గిరిజా? ఈ రోజుల్లో భయపడవలసినది ఏమీ లేదు. ఎంతోమంది స్పెషలిస్టులుంటారు గవర్నమెంటే ఎబార్షన్ను లీగలైజ్ చెయ్యాలనుకుంటూ ఉన్న రోజులివి. పైగా నువ్వు రెండు నెలల లోపలే ఉన్నావు. ఏ రేం భయం లేదు' అని మోహన్ ఆమెను ఒప్పించాడు. కాని అతనికి ఈ స్పెషలిస్టులు ఎవరో బొత్తిగా తెలియదు. వీరి గురించి ఎవర్ని వాకబు చెయ్యాలో అంతకన్నా తెలియదు.

'మీ హాస్టల్ వార్డెన్ను అడగరాదూ? ఆవిడ ఎంతో మంచిది, అడపిల్లల్ని చూస్తూ ఉంటుంది. ఇటువంటి సమస్యను ఆవిడ ఎప్పుడైనా పరిష్కరించి ఉండవచ్చని నా నమ్మకం.'

'అబ్బా! ప్రిన్సిపాల్‌తో చెప్పేస్తే నా గతి ఏమవుతుంది?'

'ఆవిడలా చేస్తుందని నీకెలా తెలుసు?'

'ఆవిడ సంగతి నాకు బాగా తెలుసు చాల నిక్కచ్చి మనిషి'

'మరి ఎవరో ఒకర్ని నమ్మకపోతే ఎలా?'

'కాలేజీకి సంబంధించినవారు మాత్రం వద్దు.'

ఆ రాత్రి మోహన్ ఇంటికిచేరి 'స్పెషలిస్టులు ఎవరు' అని ఎవర్ని అడగాలో దీర్ఘంగా ఆలోచించాడు. చివరకు ఆ వూళ్ళో తనకు బాగా తెలిసినవారి పేర్ల జాబితా తయారు చేశాడు. కాని ఆలోచించి చూస్తే,

---

'మేం టెలిఫోన్ చేసేటప్పుడు హలో అంటాం' అన్నాడొక అమెరికన్.

'అయితే మా పద్ధతే మంచిది' అన్నాడు బ్రిటిష్ వాడు

'ఏమిటి, మీ పద్ధతి?'

ఫోన్ చేసేటప్పుడు - నువ్వెక్కడున్నావ్' అంటాం మేం. ఉండకపోతే అసలు మాట్లాడలేము కదా.'

---

అందులో ఏ ఒక్కరూ తన సమస్య తీర్చగలరనే నమ్మకం కలుగక పోవడమేకాక తన రహస్యం బయట పెట్టేస్తారనికూడా అతనికి భయం పట్టుకుంది.

నిస్పృహతో మోహన్ ఆ కాగితాన్ని చించిపారేసి, బల్లమీద తల పెట్టి తన్ను తానే నిందించుకోవడం ప్రారంభించాడు. ఇంతలో "నాయనా మోహన్" అంటూ రమణమ్మ గారు లోపలికొచ్చింది. అతను వెంటనే లేచి 'రండి, రండి' అంటూ ఆమెను ఆహ్వానిస్తూ ఆమెకొక కుర్చీని చూపేడు.

"ఏం బాబూ, పెద్ద పరీక్షలయి వారం జలయింది. మీ వూరింకా వెళ్ళలేదేం?" అని అడిగింది.

"ఏవో కొన్ని పనులుండటంచేత వెళ్ళలేదండి."

"నువ్విక్కడనుంచి వెళ్ళిపోతున్నావంటే నాకెంతో విచారంగా ఉంది, నాయనా. ఇన్నాళ్ళూ నీకిక్కడ సౌఖ్యంగానే గడచింది కదూ?"

అబ్బ ఎంత ఆప్యాయంగా మాట్లాడుతోంది ఈవిడ! తన గోడు ఈమెతో ఎందుకు చెప్పకూడదు? ఈ వూరి మనిషి అవడంచేత ఈవిడకి ఏ స్పెషలిష్టయినా తెలిసి ఉంటాడు. వెంటనే ఆ నిశ్చయానికి వచ్చేశాడు మోహన్.

"ఈ ఇంటిని, మిమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళాలంటే నాకూ ఎంతో బాధగా ఉంది రమణమ్మగారు. అయినా వెళ్ళక తప్పదుకదా. కాని వెళ్ళేముందు మిమ్మల్ని ఒక చిన్న సహాయం కోరాలని ఉంది."

"ఏమిటి బాబూ, అది?"

"మీరీ వూళ్ళో, చాలాకాలం నుంచి ఉంటున్నారు కదూ?"

"చాలకాల మేమిటి, బాబు? నేను పుట్టింది ఇక్కడే; బ్రతికేది ఇక్కడే; చచ్చేది ఇక్కడే."

"అంతమాట ఎందుకులెండి ... అయితే మీకీ వూళ్ళో ఎంతో మందితో పరిచయం ఉండి ఉంటుంది; ఎన్నో విషయాలు మీకు తెలిసి ఉంటాయి."

"ఏమిటో నాయనా, నువ్వంటున్నదేమిటో నాకర్థమవడంలేదు. అడగదలచిందేదో సరిగ్గా అడగరాదూ? ఈ డొంకతిరుగుడంతా ఏమిటి?"

"చెప్పడానికి భయపడుతున్నానండి. అడగడానికి ఎంతో పశ్చాత్తాప పడుతున్నాను."

"సరేలే, సంగతేమిటో ముందు చెప్పు."

మోహన్ కథ ప్రారంభించాడు... ...

"అయ్యయ్యో, నేనింట్లో లేకుండాచేసి, ఎవతో ఒక పిల్లను ఇక్కడకు తెచ్చి... నువ్వేదో పెద్దింటి అబ్బాయివనుకున్నాను గాని ఇలాంటి తప్పుడు పనులు చేసేవాడివని కలలో కూడా అనుకోలేదు" అంటూ రమణమ్మ అతన్ని బాగా దూషించటం మొదలు పెట్టింది

తనమీద దయదలచి ఎవరైతే

సహాయం చేస్తారనుకున్నాడో వారే తన్నిలా తూలనాడటంతో మోహన్ బాగా క్రుంగిపోయి, ఆవిడకు ఎలాంటి సమాధానం ఇవ్వ లేకపోయాడు

కొంతసేపటికి రమణమ్మగారి ధోరణి తగ్గింది. ఆ అదను చూసుకొని, అతను తలెత్తి, దీనంగా ఆమె వంక చూస్తూ బ్రతిమాలుకున్నాడు:

"నేను చేసింది తప్పే. అందుకు మీకు మనస్ఫూర్తిగా క్షమార్పణ చెప్పుకుంటున్నాను. నాకు సహాయం చెయ్యలేకపోతే చెయ్యకపోయారు గాని ఈ రహస్యాన్ని మాత్రం దయచేసి ఎక్కడా బయటు పెట్టకండి."

ఒక నిమిషం ఆమె మౌనంగా వుండి మళ్ళీ ప్రశ్నించింది:

"ఊ, తరువాత ఏం జరిగింది?"

ఆమె అలా అడగటంతో మోహన్లో అంతరించిన ఆశలు తిరిగి ఉద్భవించాయి. గిరిజకు వచ్చిన సమస్య, దానికి పరిష్కారంగా తను సూచించిన విధానాన్నిగూర్చి చెప్తూ అన్నాడు!

"మీ ఎరుకలో ఇలాంటి స్పెషలిస్టులు ఎవరైనా ఉండుంటారు కాబట్టి..." మోహన్ నాలిక కొరుక్కుని చటుక్కున ఆగిపోయాడు.

"అంటే అలాంటి వారికి నేను సహాయపడి పనిచేస్తూ ఉంటానని నీ అభిప్రాయమా?" అని ఆవిడ కోపంతో అడిగింది.

"క్షమించండి, రమణమ్మగారు. మీకు మళ్ళీ కోపం తెప్పించాను. నా ఉద్దేశమది కానేకాదు. మీరు ఈ ఊరివాళ్ళు; పెద్దలు. కాబట్టి అటువంటి చిక్కుల్లోపడి ఎవరైనా మీ సహాయం అర్థించి ఉండవచ్చు. అప్పుడు మీరు వాళ్ళని ఇటువంటి కేసులు చేపట్టే స్పెషలిస్టు దగ్గరికి పంపించి ఉం..."

రమణమ్మగారు తన మాటలు వినకుండా ఏదో దీక్షంగా ఆలోచిస్తూ ఉండటంచూసి మోహన్ ఆగిపోయాడు

ఆ ఐదు నిమిషాలు గడిచిపోయిన తరువాత ఆమె అంది:

"అవును, నువ్వన్నది నిజమే. ఐదారేళ్ళ క్రితం మా బంధువుల కుర్రవాడొకడు ఇలాగేచేసి నా దగ్గరకొస్తే, వాణ్ణి, ఆ పిల్లని నాకు తెలిసిన ఒక స్పెషలిస్టు వద్దకు పంపేను. ఆ తరువాత వాడికి, ఆ అమ్మాయికి చిక్కులన్నీ తీరిపోయాయి."

"ఇందులో ప్రాణాపాయం ఏమీ ఉండదు కదండి?" అని అతను ఆత్రుతతో ప్రశ్నించాడు.

"చీమ కుట్టినంత బాధ కూడా ఉండదు; ఇక ప్రాణాపాయం ఏమిటి నా మొహం? ఆయనంత గొప్ప స్పెషలిస్టు"

మోహన్ కళ్ళు ఆనందంతో మెరిశాయి. నిజంగా గిరిజ చాల అదృష్టవంతురాలే ననుకున్నాడు.

"అయితే ఆయనకు డిగ్రీలు, డిప్లొమాలు చాల ఉండి ఉండాలి."

"ఏమున్నాయో నాకు తెలియదు కాని ఇలాంటి సమస్యలు సునాయాసంగా తీర్చడంలో ఆయనంతటి

వేర్వేరి మరొకరు లేరని గట్టిగా చెప్పగలను.'

'రక్షించావు రమణమ్మగారు. ఇప్పుడు నా కెంతసంతోషంగా ఉందో చెప్పలేను. నా మనస్సు ఇప్పుడు గాని కుదుటపడలేదు. మీ మేలు ఎన్నటికీ మరువలేను' అని అతనామెకు తన కృతజ్ఞత వెల్లడించాడు.

'ఆ, ఏముందిలే నాయనా. ఏదో మొదట్లో కోప్పడ్డానుగాని ఆ మాత్రం సాయం నీకు చెయ్యలేనా ఏమిటి? ఇన్నాళ్ళు నా యింట్లో ఉన్నావాయె'

'ఇక ఆలస్యమెందుకు, రమణమ్మగారూ? ఆయన పేరు, ఎడ్రసు చెప్పండి. ఇప్పుడే వెళ్తాను' అని మోహన్ హుషారుగా కుర్చీమీద నుంచి లేచి నిలబడ్డాడు.

'ఆయన పేరు - పూర్ణానందం. కాని నువ్వాయన్ని కలవటం ఇప్పుడుకాదులే, బాబూ. ముందుగా నే నాయనతో మాటాడి వస్తాను!'

'అలాగేనండి రేపే ఆయన్ని కలస్తారు కదూ?'

'అవును. మీ పూర్తిపేర్లు, పుట్టిన తేదీలు ఒక కాగితంమీద రాసివ్వు ఆయన తప్పనిసరిగా అడుగుతాడు.'

'పుట్టిన తేదీలా! అవెందుకండీ ఆయనకు?' అని మోహన్ ఆశ్చర్యంగా అడిగాడు.

తాము మాటాడుకుంటున్న విషయానికి వాటి అవసరం ఏమిటో అతనికి అంతుబట్టలేదు.

'మంచిప్రశ్నే వేశావు. పూర్ణానందంగారు ఎంత గొప్ప స్పెషలిస్టయినా చాల ఛాదసపు మనిషి. మంచి ముహూర్తం చూడందే ఏ పనీ తలపెట్టడు.'

మారు మాట్లాడకుండా మోహన్ ఆమె అడిగింది రాసిచ్చాడు.

'ఇక నేను చెయ్యవలసింది చేస్తాను. రేపు నువ్వా అమ్మాయిని కలుసుకొని ధైర్యం చెప్పు నాయనా పాపం, ఎంత భయపడుతుందో ఏమో' అంటూ ఆమె లేచింది.


'అలాగేనండి... మీ మేలు...' అని అతను అంటూ ఉండగానే ఆమె తన భాగంలోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సంతోషంతో మోహన్‌కి నిద్రపట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ఈ శుభవార్తను గిరిజకు చెప్పుదామా అని ఉబలాటపడుతున్నాడు.

మరునాడు ప్రొద్దున్నే రమణమ్మగారు ఇల్లువిడిచి వెళ్ళిపోయింది. మధ్యాహ్నం తిరిగి వస్తుందేమోనని అతను ఆమెకోసం కాచాడు. కాని సాయంకాలంగాని ఆమె తిరిగి రాలేదు.

'ఏమండీ వెళ్ళినపని ఏమయింది? పూర్ణానందంగారు ఈ పనికి ఒప్పుకున్నట్టేనా?' అని మోహన్ ఆదుర్దాగా అడిగాడు.

'ఒప్పుకోక ఏంచేస్తాడులే? కాని ఆయన చేత ఊ అనిపించటానికి నా తాతలు దిగొచ్చారనుకో. ఆయన చేయవలసిన కేసులు ఇప్పు




టికే చాల ఉన్నాయి. కాని అతి కష్టంమీద మీ పని త్వరలోనే చెయ్యడానికి ఒప్పుకున్నాడు.'

'చాల సంతోషమండి. మరి ఆయన ఫీజు మాకేమిటి?'

'ఆ సంగతి తరువాత చూసుకో వచ్చు. నీకేం భయంలేదు. నే మన్నానుగా' అంది రమణమ్మగారు గూఢంగా.

'మరి ఆయనవద్దకు గిరిజను ఎప్పుడు తీసుకు వెళ్ళాలండి?'

'ఈ రోజు సోమవారం. వచ్చే ఆదివారం సాయంకాలం అయిదు గంటలకు గిరిజను వెంటబెట్టుకొని, నిన్ను తన ఇంటికి రమ్మన్నాడు. ఇదుగో ఆయన ఎడ్రస్సు' అని ఆమె అతనికొక కాగితాన్ని అందిచ్చింది.

మోహన్ దాన్ని చదివి ప్రశ్నించాడు;

'ఆయన ఇంట్లోనే క్లినిక్ ఉందా అండి?'

'లేదు. అది వేరేచోట ఉంది. కాని ఆయన మిమ్మల్ని రమ్మన్నది తన ఇంటికే. అక్కడే అంతా ఏర్పాటు చేస్తానన్నాడు.'

జరగబోయే విషయాన్ని అత్యంత రహస్యంగా ఉంచాలి కాబట్టి అందుకు ఆయన తన ఇంట్లోనే సన్నాహాలు చేస్తున్నాడన్న మాట! నిజంగా ఈ పూర్ణానందం మంచి జాగ్రత్తగల మనిషే..

'ఏమిటి బాబూ. ఏదో ఆలోచిస్తున్నావే?' అని రమణమ్మగారు మళ్ళీ అడిగింది.

"మరేం లేదండి. మీరుకూడా ఆ సమయానికి అక్కడవుంటే మా కెంతో ధైర్యంగా ఉంటుంది. దయచేసి మీరుకూడా..."

"ఓ తప్పకుండా వస్తాను. నువ్వు మాత్రం నిశ్చింతగా ఉండు. కాని ఆయన చెప్పిన టైముకు మీ రక్కడకు వెళ్ళకపోతే ఆయన మనల్ని ఇక దగ్గరకు రానియ్యడు" అని ఆమె అతన్ని గట్టిగా హెచ్చరించింది.

"ఎబ్బెబ్బే, అలా ఎప్పుడు చెయ్యనండి. వచ్చే ఆదివారం సాయంకాలం అయిదు గంటలకు పంక్చ్యువల్‌గా మేమిద్దరం అక్కడ ఉంటాం, చూడండి" అని అతను బాస చేశాడు.

"మంచిది, నాయనా. అలాగే చెయ్యి. ఇక నేను వెళ్ళొస్తాను," అంటూ ఆవిడ తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆ అయిదురోజులు వారిద్దరికి అయిదు యుగాల్లాగ గడిచాయి.

ఆదివారం వచ్చింది. సాయంకాలం మూడు గంటలయ్యేప్పటికి మోహన్ గరల్స్ హాస్టల రిసెప్షన్ గదికి వచ్చేశాడు.

"నా కెందుకో చాల భయంగా ఉంది మోహన్."

"భయం దేనికి? పూర్ణానందం గారు చాల నేర్పరి, మంచివాడని రమణమ్మగారు చాల చెప్పింది. నీ కేమీ భయంలేదు ధైర్యంగా ఉండు."

"భయంమాట అటుంచు. నా పరిస్థితిని చూసి నాలో నేనే సిగ్గుతో చస్తున్నాను. ఇక ఆయన మొహం ఎలా చూసేది? ఏమంటాడో నన్ను చూసి?"

"ఏమీ అనడు. ఆయన చాల పెద్దమనిషి. తన డ్యూటీ తను చేసి ఫీజు తీసుకుంటాడు గాని మన చర్యల్ని ఎప్పుడూ విమర్శించడు. ఆ భయమేమీ నీ కక్కర్లేదు."

"ట్రీట్‌మెంట్ ఎన్నిరోజులు పడుతుందో ఏమో? నేనిక్కడున్నించి వచ్చేవారంలో వెళ్ళిపోవాలి."

"ఈ నెల ఆఖరువరకు ఇక్కడ ఉండనివ్వమని మీ వార్డెన్ను రిక్వెస్ట్ చెయ్యకూడదూ?"

"అదేమి లాభం లేదు, మోహన్. కాలేజి మూసేసినా ఆమె నన్నిక్కడ ఇన్నాళ్ళు ఉండనిచ్చింది. అదే గొప్పసంగతి. వచ్చేవారంలో ఖాళీ చేసెయ్యాలని ప్రొద్దున ఖచ్చితంగా చెప్పేసింది. ట్రీట్‌మెంట్ ఆలస్యం అయితే మరి ఆ తరువాత నే నెక్కడ ఉండేది?"

తన స్థితి తలచుకోగానే గిరిజ కళ్ళు కన్నీటితో నిండాయి. మౌనంగా మోహన్ అందించిన జేబురుమాలుతో కళ్ళు తుడుచుకొంది.

ఒక నిమిషం ఆలోచించిన తరువాత అతనొక నిర్ధారణకొచ్చి అన్నాడు:

"నువ్వేమి దిగులుపడకు, గిరిజ. రమణమ్మగారి భాగంలో నీ కొకగది ఏర్పాటు చేస్తాను. ఆవిడ నా మాట కాదనదు. అయినా పూర్ణానందం గారితో ఈ విషయంకూడా చెప్పు

దాం. మన పనిని సాధ్యమైనంత త్వరలో కానిచ్చేస్తాడు... టైము యింది. ఇక బయలుదేరు.'

'ఏమో మోహన్, నా శరీరం తేలిపోతున్నట్లుంది.'

'వేడి వేడి కాఫీ త్రాగితే అంతా పోతుంది లే.'

సరిగ్గా అయిదు గంటలకు మోహన్ గిరిజలు రమణమ్మగారిచ్చిన ఎడ్రస్సుకు చేరారు. వెంటనే గిరిజకు కాళ్ళు వణకటం ప్రారంభించాయి. మోహన్ ఆమెను పట్టుకొని ధైర్యవచనాలు పలుకుతూ, నెమ్మదిగా లోనికి నడిపించుకొని తీసుకువెళ్తున్నాడు. అదే సమయానికి రమణమ్మగారు బయటకువచ్చి అతనికి సహాయపడింది.

♦ ♦

రెండున్నర గంటలతరువాత గిరిజ మోహన్‌లు ఆ యింటినుంచి బయటకువచ్చి, చల్లగాలికని బీచికి వెళ్ళి, అక్కడ ఇసుకతిన్నెలమీద కూర్చొని మాట్లాడుకోవడం ప్రారంభించారు.

'అబ్బ, నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేకపోతున్నాను,' అంది గిరిజ. ఆమె కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి.

'చచ్చి, మళ్ళీ బ్రతికినట్టుంది నాకు,' అన్నాడు మోహన్ సంతృప్తిగా నిట్టూరుస్తూ.

'తమరిక ఓడలెక్కి విదేశాలు తిరగడం కుదరదు' అంది గిరిజ చిలిపిగా.

> భార్యాభర్తలు సినిమాకెళ్ళి వచ్చారు. భార్య అంది!
> 'చూడండి ఆ సినిమాలో హీరో హీరోయిన్‌తో ఎంత ప్రేమగా మాట్లాడకాడో. మీ రెప్పుడన్నా నాతో అలా మాట్లాడారా ?'
> భర్త : 'ఏడిశావ్. అది సినిమా. అలా మాట్లాడీనందుకు వాళ్ళు బోలెడు డబ్బు పుచ్చుకుంటారు.'

'పోనీలే, వాటిగురించి పుస్తకాల్లో చదువుతుంటాను.'

'మీ పత్రికను ఇంప్రూవ్ చేసుకోవచ్చు కూడా.'

'నిజమే, మా నాన్నకూడా చాల సంతోషిస్తాడు.'

'ఇదంతా ఆ పూర్ణానందంగారి చలవే.'

'నిస్సందేహంగా.'

పూర్ణానందంగారు పేరుబడ్డ పురోహితుడు అంతేకాక మంచి వాగ్ధాటిగల మనిషి తన వాక్చాతుర్యంతో మోహన్ గిరిజలను వారు చేసిన తప్పుకు పరిష్కారంగా వివాహమొక్కటే మార్గమని సూచించి, బోధించి ఒప్పించి, ఆరున్నర గంటల ముహూర్తానికి గిరిజ మెడలో మోహన్ చేత తాళి కట్టించేశాడు.

□□□